గేమ్

విహారి & శాలివాహన



నిన్నగాక మొన్న—

చిన్ననాడు చదువుకున్న వూరుగదా, ఒకపూట వుండి బాల్యమిత్రులతో సరదాగా గడుపుదామని నేనావూళ్ళో బసచేయక పోయినా,—

మనసు అట్టడుగు పొరల్లో; జ్ఞాపకాల ధూపంలో నిక్షిప్తమైన చలపతి హఠాత్తుగా నా కళ్లెదుట సాక్షాత్కరించక పోయినా,—

అతను 'డా. చలపతి, హోమోపాత్, చిల్డ్రన్స్ స్పెషలిస్టు'గా ఆ వూళ్లో పేరు ప్రఖ్యాతుల్ని ఆర్జించాడని నేను వినక పోయినా,—

నేనీ కథ వ్రాసి వుండేవాడ్ని కాదు.

పది పన్నెండు కాలెండర్లు మారక పూర్వం—

జిల్లాకు ఒకటి రెండు కంటే ఎక్కువ లేని కాలేజీలలో విద్యాభ్యాసానికై, ఉన్న వూరు విడిచి పట్టణాలకు తరలి వచ్చిన అనేక మంది విద్యార్థుల్లో నేనొకడ్ని. ఊరికి దూరంగా వున్న కాలేజీ కావడాన్నేమో, కాలేజీలో సీటుకంటే, హాస్టల్లో సీటు దొరకడం చాలా కష్టంగా వుండేది ఆ వూళ్లో.

కాలేజీకి, హాస్టలుకు సంబంధించిన పాత జ్ఞాపకాలెన్నో వున్నా, 'ఏ,ఎం.డీ'తో ప్రారంభమై 'ఏరో' వరకూ వచ్చే స్నేహితులెంతో మంది వున్నా, చలపతి మాత్రం నా మనసులో శాశ్వతంగా విశిష్టమైన స్థానాన్ని ఏర్పరచుకున్నాడు.

ఆరోజు రాత్రి...

అప్పటికి హాస్టల్లో చేరి వారం రోజులైందేమో. నా రూమ్మేటు హరి మినహాయించి మరెవరూ నాకు పరిచయం కాలేదప్పటికి. రాత్రి తొమ్మిదిగంటల సమయంలో ప్రక్క గదిలో నుంచి పెద్దగా మాటలు విన్పించాయి.

'ఏమైనాసరే, నువ్వీగదిలో వుండటానికి వీల్లేదు. నాతో సమానంగా చదువుతున్నంత మాత్రాన నా గదిలో వుండే అర్హత నీకు లేదు. నేనిప్పుడే వెళ్ళి వార్డన్‌కు అన్ని విషయాలూ చెప్పేస్తాను.'

'బాబుగారూ! ఆ పని మాత్రం చేయకండి. ఇప్పటికే నలుగురిలో తలెత్తుక తిరుగలేకుండా వున్నాను. ఆ విషయాలన్నీ మీరు బయటపెట్టొద్దు. మీకు పుణ్యముంటుంది.'

'నీకు నామర్దా ఏమిట్రా వెధవా ఒకవూరివాళ్లమనే మిషతో ఒకేరూంలో నాతో సమానంగా వుందామని ఎత్తువేస్తావా?'

'నేను కావాలని కోరలేదు బాబుగారూ నామాట నమ్మండి.'

'అయితే వెళ్ళు వార్డెన్‌గారికి చెప్పి మరో గదిలో వుండు, పో.'

పాదాలు కనిపించనంత క్రిందికి పైజామా, మోకాళ్లదాకా షర్టు; అవమానంతో కందిన మొహాన్ని కర్చీఫుతో తుడుచుకుంటూ, అతను వార్డెన్ రూంవైపు నడవడం చూశాను, అప్పటికే వరండాలోకొచ్చి

నిల్చున్న నేను.

అతనే చలపతి.

ఆ సమయంలో హరి రూంలో లేడు. కొంత సేపటికి వచ్చాడు. ప్రక్కగదిలో మిత్రుల తగాదా విషయం నేనతనికి చెప్పక ముందే హరి అన్నాడు: మన ప్రక్క రూంలో చలపతి లేడూ, ఇవాళ వేడి వేడి పకోడీలు తిన్నాడు వార్డెన్ దగ్గర.'

పకోడీలంటే చీవాట్లు, చేగోడీలంటే తన్నులూ మా పరిభాషలో.

'ఎందుకూ?' కుతూహలంగా అడిగాను.

'తనకా రూం వద్దుట, మరోచోటి కావాలిట.'

'కారణం?'

'ఏమోమరి సరిగా చెప్పలేదు. వార్డెన్‌కు బలేకోపం వచ్చింది...'

ఇంతలో వరండాలో ఎవరో నడుస్తున్న అలికిడి విన్పించింది.

'వెంకుబాబూ!'

'సార్'

'చలపతిది మీవూరే కదూ?'

'అవునండీ.'

'మీ యిద్దరికీ విరోధమేమైనా వుందా?'

'విరోధమూలేదు, అలాగాని స్నేహమూ లేదండి.'

'ఆన్సర్ టుదిపాయింట్. దట్సాల్ రైట్...చలపతీ పిచ్చివేషాలు వేయకు. ఇష్టమొచ్చిన రూం కావాలనేందుకు ఇది హోటలుకాదు. డిసిప్లిన్డ్‌గా ఉండాల్సిన హాస్టలు. ఎల్లాట్‌చేసిన రూంలో అడ్జెస్టు కావలసిందే. తెలిసిందా?'

వార్డెన్ వెళ్లిపోయాడు. చుట్టుప్రక్కల గదుల్లోనుంచి వరండాలోకొచ్చి, గదిలోవున్న చలపతివైపు, వెంకుబాబు వైపు వింతగా చూడటం మొదలెట్టారు విద్యార్థులు. అందరిసంగతి ఏమోకాని, నాకుమాత్రం వెంకుబాబు కళ్లల్లో కోపమూ, అధికారమూ, తల వంచుకుని నిల్చున్న చలపతిలో నిస్సహాయతా కన్పించాయి. పరిసరాల్ని గమనించిన వెంకుబాబు చివాలున వచ్చి గది తలుపులు మూయడంతో విద్యార్థులు ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్లిపోయారు.

పాఠాలింకా మొదలెట్టకపోవడంమూలాన చదవవలసింది ఏమీ లేక పడుకున్నాను. కాని నిద్ర పట్టలేదు. ప్రక్క గదిలో వెంకుబాబు కంఠం విన్పించింది.

'గెల్చాననుకుంటున్నావేమో, నీ జుట్టు నా చేతిలో వుంది. నేను చెప్పినట్లు వినక పోయావో నీ పని వట్టా.'

'మీరు చెప్పినట్లే వింటాము. వన్నల్లరి పెట్టొద్దు బాబుగారూ?' చలపతి నమ్రతగా పలుకుతున్నాడు...

తెల్లవారి, మొహం కడుక్కోటానికి పంపు వేపు వెళ్తూ, కిటికీలోనుంచి ప్రక్క గదిలోకి చూశాను. ప్రతి గదిలోను రెండు కుర్చీలు, రెండు టేబుళ్లూ ఉంటాయి, గదిలో వుండే ఇద్దరూ కూర్చుని చదువుకోడానికి వీలుగా. ఆ గదిలోని రెండు టేబుళ్లూ నిలువుగా ఒకదానికి దగ్గరగా మరొకటి జరుపబడి వున్నాయి. వాటిమీద పరుపు వేసుకుని పడుకున్నాడు వెంకుబాబు. వో మూల, చాప మీద చలపతి పడుకున్నాడు.

తన ఆధిక్యతను (?) ఆ విధంగా నిలుపుకున్నాడు వెంకుబాబు. నాకు ఒకటి మాత్రం అర్థంమైంది, వెంకుబాబు చలపతిని ఏదో తక్కువ దృష్టితో చూస్తున్నాడని. కారణం? వెంకుబాబు అగ్రజాతివాడా? కాదే. ఇద్దరూ మాంసాహారులే. మరి?

మొహాలు కడుక్కున్నవాళ్లలో కొందరు తిరిగి హాస్టలు వేపు వెళ్తున్నారు. మరి కొందరు స్నానాల గదులవైపు నడుస్తున్నారు. అప్పటికి వెంకుబాబు రావడం, మొహం కడుక్కోడం అయిపోయింది. చలపతి చేతిలో పళ్ల పొడితో పంపుల దగ్గర ఖాళీకోసం చూస్తున్నాడు.

'ఒరేయ్ చలపతీ! రూం కెళ్లి, టవలూ, సోప్‌బాక్స్ తెచ్చిపెట్టు. స్నానం చేయాలి.'

వెంకుబాబు హుకుం జారీ చెయ్యడం, చలపతి బుద్ధిమంతుడైన నౌకరులాగా శిరసావహించడం నేను, హరి—అందరం గమనించాం.

అప్పట్నుంచీ చలపతి అంటే ఒక విధమైన జాలి ఏర్పడింది నాలో. వెంకుబాబు తన కవసరమైన ప్రతి పనికీ చలపతిని నౌకరుగా వాడుకోవడం, అది చూసిన మిత్రులు కొందరు వాళ్లిద్దర్నీ ఆటలు పట్టించడం పరిపాటైపోయింది.

'ఏమండోయ్ వెంకుబాబు గారూ! కుర్రాడ్ని బాగా వాడేసుకుంటున్నారే.'

'వెంకుబాబుగారూ! విదమత్తుగా వుంది. మీ శాడ్నిజింపి కొంచెం కాఫీ తెప్పిద్దూ.'

'అంతేనా, ఇంకేమైనా కావాలా? చెప్పండి బాబూ, మొహమాట పడకండి. తెచ్చేది మనవాడే.'

విద్యార్థి జీవితంలో ఒకర్నొకరు ఆటలు పట్టించుకోడం, ఏడ్పించడం, తద్వారా వినోదించడం — మామూలే. అయితే ఆ ఆటలకు వినోదాలకు గురిచేయబడిన విద్యార్థి కూడా ఇతరులను ఆటలు పట్టించడంలో సమవుజ్జీ అయినప్పుడూ, తనను ఆటలు పట్టిస్తున్నందుకు అతను బాధపడనంతవరకూ ఆ గేమ్ బాగా నే వుంటుంది. కాని చలపతిలాంటి వినమ్రజీవి, ఎన్నడూ ఎవరికీ ఎదురు పలుకని సాధువు, వెంకుబాబు మాటలకు, అతని ద్వారా ఇతర మిత్రుల మాటలకు లోలోన ఎంత కృంగిపోతున్నాడో ననిపించేది నాకు.

స్నేహితుడిగా చలపతికి చేరువౌదామన్నీ, తద్వారా అతనికి కొంత సాంత్వన లభిస్తుందని అనుకుని అందుకు ప్రయత్నించాను. కాని అతనికి చేరువకాలేకపోయాను. కావడానికి అతను అవకాశం ఇవ్వలేదు. తను దాచుకున్న రహస్యాలు నాకు తెలుస్తాయనే భయం అందుక్కారణమేమో!...

ఒకే రూంలో వుంటున్న వెంకుబాబు, చలపతి ఇద్దరూ ఒకేసారి కాలేజీకి రావడంగాని, కాలేజీనుండి కలిసి ఇంటికి రావడంగాని ఎవరూ చూసి వుండరు. కాని ఆ విషయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. క్లాసులో కూడా వెంకుబాబు ముందు బెంచీపై కూర్చుంటే, చలపతి వెనకాల చివరిబెంచీపై కూర్చునేవాడు. మెస్‌లో ఈమూల వెంకుబాబు కూర్చుని భోంచేస్తే, మరోమూల ఎక్కడో చలపతి తలవంచుక కూర్చుని అన్నం తినేవాడు.

ఒకరోజు రాత్రి పదిగంటల సమయంలో చలపతి మా గదితలుపు కొట్టాడు. నేను వెళ్లి తలుపు తీశాను. 'మీ దగ్గర టార్చి లైటుంటే ఒకసారిస్తారా' అని అడిగేడు. డ్రాయరు సొరుగులోని లైటు తీసియిస్తూ 'ఇప్పుడెందుకు' అని అడిగేను.

'వెంకుబాబుగారికి తలనొప్పిగా వుందిట. టౌనుకెళ్లి ఏవైనా టాబ్లెట్స్ తీసుక వద్దామని' (వెంకుబాబే తెమ్మని వుంటాడు)

చలపతి సమాధానానికి నేను ఆశ్చర్యపో

లేదుగానీ, నేలరోజుల క్రితం చలపతికి 'ఫ్లూ' వస్తే వెంకుబాబు తనకేమీ పట్టనట్లుగా తిరిగాడేరే, అసలు రూంలో చలపతి వున్నాడనే విషయాన్నే విస్మరించినట్లు ప్రవర్తించడం గుర్తుకు వచ్చి బాధ పడ్డాను. అలాంటి వెంకుబాబు కోసం చలపతి ఇంత రాత్రప్పుడు తల నొప్పి మాత్రల కోసం ఒంటరిగా టౌనులోకి వెళ్తున్నాడు మరి!

'అంత దూరం ఒక్కడివీ వెళ్తావా?'

'ఫరవాలేదండి. ఒంటరిగా నడవడం నాకు అలవాటే' అంటూ వెళ్ళి పోయాడు చలపతి.

అతను వెళ్ళిం తర్వాత హరి అన్నాడు: 'మనం చూట్లం లేదుగాని, వెంకుబాబు చలపతి చేతికాళ్ళు పట్టించుకున్నా పెట్టించుకోగలడు.'

'దారుణం. చలపతి ఇవన్నీ ఎందుకు సహిస్తున్నాడు? ఇతగాడ్ని ఆ వెంకుబాబేమైనా పెట్టి పోషిస్తున్నాడా, జులుం చెలాయించడానికి?'

'పోషించనవసరం లేదు బ్రదర్! దిసీజ బిజినెస్. చలపతికి సంబంధించిన ఒక వ్యక్తిగత విషయం వెంకుబాబుకు తెలుసు. ఆ విషయం నలుగురికీ తెలియడం చలపతి కిష్టంలేదు. వెంకుబాబు ఆ విషయాన్ని ఎక్కడ బయటపెడ్తాడోనని భయం చలపతికి. అతనిలోని ఆ బలహీనతను వెంకుబాబు ఉపయోగించుకుంటున్నాడు.'

'ఏమిటో, అంతరహస్యమైన వ్యక్తిగత విషయాలు!'

'చలపతి ఎప్పుడూ పైజామా ఎందుకు వేసుకుంటాడు? అందరిలా సాయంత్రం గేమ్స్ ఆడుకోడానికి రాడేం? వారానికి ఒకటి రెండు సార్లైనా టౌనుకు వెళ్ళి, పొద్దుపోయిందాకా ఏం చేస్తుంటాడు? ఈ ప్రశ్నలకు జవాబుల్లో వుంది ఆ రహస్యం. చలపతికి బోదకాలు వుంది. దాన్ని కప్పిపుచ్చుకోడానికే పాదాల క్రిందకి వేళ్ళాడే పైజామా. ఆ విషయం నలుగురికీ తెలుస్తుందనే అందరితోటీ గేమ్స్ ఆడడు. హోమ్యోపతీ మందుల్తో ఆ బోద కాలు నయమౌతుందని ఎవరో చెప్పారుట. అందుకని టౌన్లో ఎవరో హోమ్యో డాక్టరుంటే ఆయన దగ్గరకు మందుకోసం వెళ్ళి వస్తుంటాడు. ఆ డాక్టరు ఇచ్చేది

గేమ్స్

రెండు బిళ్ళలైనా రెండు గంటలు స్టడీ చేస్తాడుట.'

హరి చెప్పిన విషయాలు సబబుగానే వున్నా నాకు నమ్మశక్యంగా తోచలేదు. చలపతికి బోదకాలు వున్నదని అందరికీ కాకపోయినా అతనితో సన్నిహితంగా వుండే చాలా మందికి తెలుసు ... అందుకే పి. డి. (ఫిజికల్ డైరెక్టరు) అతనికి జనరల్ పర్మిషన్ ఇచ్చేశాడు 'ఆడ వీలుగాని గేమ్స్ ఆడనక్కర్లేద'ని మరి చలపతి వెంకుబాబుకు ఎందుకు భయపడుతున్నాడు?

ఒకనాడు తెలుగుక్లాసు జరుగుతుండగా చలపతికోసం ఎవరో వచ్చారని కాలేజీ వెయింటింగ్ రూంలో వున్నారని చెప్పాడు కాలేజీప్యూన్. చలపతివెళ్ళి మరో అరగంటలో తిరిగివచ్చాడు. కాలేజీ వదిలేముందు నాదగ్గరకొచ్చి 'కిటికీలోనుంచి మీ గదిలోకి రెండు మొక్కజొన్న పొత్తులు వేశాను. మీరు హరిగారూ తీసుకోండి. ఈ విషయం మాత్రం వెంకుబాబుగార్కి తెలీనీకండి ప్లీజ్' అన్నాడు. వాళ్ళవూరునుంచి ఎవరో వస్తుంటే వాళ్ళనాన్న పంపేడు మొక్కజొన్న పొత్తులు, చెరకు ముక్కలు. కాని వాటిని తెరగించేది వెంకుబాబేగాని చలపతి కాదని నాకు తెలుసు. చలపతిదగ్గర చిల్లర డబ్బుల్నే లాగే వెంకుబాబు మొక్కజొన్న పొత్తుల్నీ చెఱకు ముక్కల్నీ వదిలి పెడ్తాడా?'

ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు మొదలైనై. తెల్లవారితే ఇంగ్లీషు పరీక్ష. నేను వ్రాసుకున్న కొన్ని వ్యాసాలలో తప్పులున్నాయనే అనుమానంతో చలపతి నోట్సుతెచ్చి సరిచూసుకున్నాను. అప్పటికి పదకొండు గంటలయింది. చలపతి నోట్సు తిరిగి ఇచ్చేద్దామని వాళ్ళగది కిటికీ దగ్గరకు వెళ్ళాను. వెంకుబాబు పడుకుని నిద్రపోతున్నాడు. చలపతి అరఠావు కాగితం మీద సన్నని అక్షరాలతో ఏదో వ్రాస్తున్నాడు. నోట్సు ఇచ్చేస్తూ 'ఏమిటి వ్రాస్తున్నావ్' అని అడిగాను.

'ష్ష్ అరవకు వెంకుబాబుగారికి ఎస్సేలు రాలేదుట. పరీక్షలో కాపీచేయడానికి వీలుగా కాగితంమీద వ్రాశివ్వమంటే వ్రాస్తున్నాను. కాపీ చేయవద్దని ఎంతచెప్పినా వినలేదు' అన్నాడు.

'నోట్సు నాదగ్గరే వుంచుకొని, ఎలా వ్రాస్తున్నావ్? నీకు కంఠతా వచ్చాయా?'

చలపతి నవ్వేడు. నేను మెదలకుండా వచ్చేశాను.

మర్నాడు పరీక్షహాల్లో చలపతి కాళ్ళ దగ్గర పడివున్న కాగితపు వుండను పైకి తీసి దాన్ని విప్పిచూశారు వాచరు విశ్వనాథంగారు. ప్రశ్నాపత్రంలోని రెండు ముఖ్యమైన ప్రశ్నలకు సంబంధించిన వ్యాసాలవి.

'ఎవరిపని చేసింది? విశ్వనాథంగారు చలపతిని గద్దించారు.

'నాకు తెలియదండీ.'

'నీకు తెలీకుండానే నీ కాళ్ల దగ్గరకు వచ్చిందా ?'

'ఎవరో విసిరితే నా కాళ్ల దగ్గర పడొచ్చు గదండీ.'

ముందు బెంచీలో కూర్చున్న వెంకుబాబు తీక్షణంగా చూశాడు చలపతి వైపు.

'అలాగా. ఏదీ నీ ఆన్సర్ బుక్ చూడనీ' అంటూ చలపతి ఆన్సర్ బుక్‌లోని వ్యాసాలు, కాగితంలోని వ్యాసాలు పరిశీలించి ఆ రెండూ ఒకటేనని పైగా దస్తూరి కూడా సరిపోయింది కాబట్టి చలపతి కాపీ చేశాడని నిర్ణయించి, ఆ విషయాన్ని చీఫ్‌కు రిపోర్టు చేశారు విశ్వనాథంగారు.

చలపతికి జరిగిన అన్యాయానికి నాకు ఏడుపొచ్చింది. చలపతి పరీక్షలో కాపీ చేయలేదు. అది నిజం. కాపీ చేసింది వెంకుబాబు. అది నాకూ, చలపతికీ తెలుసు. కాని ఆ నిజాన్ని ఎవరు బయటపెట్టాలి ?

'చలపతీ! వెంకుబాబుకు సేవలు చేయడం, అతను చెప్పినట్లల్లా నువ్వాడటం బాగా వుందేమో కాని ఇప్పుడు నీవు చేస్తున్నది మాత్రం బాగా లేదు. నీ మీద పడిన ఈ నేరం నీ జీవితానికే దెబ్బ. బాగా ఆలోచించుకో. ఇప్పటికైనా మించిపోలేదు. చీఫ్‌కి కనిపించి జరిగినదంతా చెప్పు. నీలాంటి బ్రిలియంట్ స్టూడెంట్ కాపీ చేస్తాడని ఎవరూ నమ్మరు. చీఫ్ తప్పుకుండా వింటాడు' అన్నాను.

'కాని...ఆ కాగితం నా దస్తూరీతో వున్నది. కాపీ చేసేవాడెవడైనా కాపీ మెటీరియల్‌ను స్వయంగా వ్రాసి తెచ్చుకుంటాడు. కాని వెంకుబాబు నాచేత వ్రాయించి తెచ్చు

కున్నాడు. ఈ విషయాన్ని నేను చెప్పినా ఎవరు నమ్ముతారు ?'

అతని నిస్సహాయ పరిస్థితికి నే నేవిధం గానూ సాయపడలేకపోయాను.

ఇంతలో వెంకుబాబు అక్కడికి వచ్చి చలపతితో అన్నాడు. 'ఒరేయ్ చలపతీ ! నీవేం భయపడమాకు. ఆ పాపరుగాడి సంగతేదో నేను చూస్తాగా. రిపోర్టిస్తాడూ, రిపోర్టు !' వెంకుబాబు దూకుడుగా వెళ్లిపోయాడు. నేను, చలపతి హాస్టలుకు నడిచాం.

ఆ రాత్రికి ... కాలేజీనుండి ఇంటికి వెళ్తున్న లెక్చరర్ విశ్వనాథంగారిపై ముసుగువేసి నలుగురు విద్యార్థులు ఆయన్ని కొట్టారని, చలపతి కాపీ చేశాడని రిపోర్టిచ్చినందుకు చలపతే ఆయన్ని కొట్టించినట్లుగా, విశ్వనాథంగారు లిఖిత పూర్వకంగా ప్రిన్సిపాల్‌కు రిపోర్టిచ్చాడని వార్త మోసుకొచ్చాడు హరి.

నాగుండె జల్లుమంది. వెంకుబాబు చేసిన ఈ నేరం కూడా చలపతి మీదనే పడింది. చలపతి ఊబిలో ఇరుక్కున్నాడు. తనను తాను రక్షించుకునే స్థితిలో లేడు చలపతి. అందుకని నిజాన్ని నేనే బయట పెడ్దామని నిర్ణయించుకున్నాను. నేనుగా ప్రిన్సిపాల్‌కు వెళ్లి చెప్పడం కంటే హాస్టల్ వార్డెన్ ద్వారా చెప్పిస్తే బావుంటుందని తోచింది నాకు. వెళ్ళి వార్డెన్‌కు చెప్పాను.

'విశ్వనాథంగార్ని కొట్టింది ఎవరో తెలీదు గాని, కొట్టించింది మాత్రం చలపతి కాదు మేష్టారూ'

'మరి నువ్వా?'

'అదేవిటిసార్ అలా అంటారు?'

'ఇంకెలా అనమంటావ్ బ్రదర్! ఆ కాపీ కాగితంలోని దస్తూరి తనదేనని చలపతే ఒప్పుకున్నాడు. అందులోని వ్యాసాలే ఆనర్స్ బుక్‌లో యథాతథంగా కన్పిస్తున్నాయి. విశ్వనాథంగారు రిపోర్టిచ్చారు. ఆ తర్వాత ఆయన్ని కొట్టారు. ఈ విషయాల్ని ఆధారంగా ఆలోచిస్తే, తన మీద చెయ్యి చేసుకున్న వాళ్లకు ప్రోత్సాహం చలపతే అని విశ్వనాథంగారు విశ్వసించడంలో తప్పులేదు, అలా అని ప్రిన్సిపాల్‌కు రిపోర్టివ్వడంలోనూ తప్పులేదు ... అనవసరంగా ఊబిలో దిగకు. వెళ్ళు.'

తమదాకా రానంతవరకూ చాలామంది అసత్యాన్ని, అన్యాయాన్ని చూసి కూడా చూడనట్లు నటించడమెందుకో వార్డెన్ గారి మాటలవల్ల నా కర్థమైంది. అయిష్టంగానే రూం కొచ్చాను.

చలపతిని గురించిన ఆలోచనతో రాత్రంతా నిద్రపోలేదు. నిద్రలేచేసరికి కొంచెం ప్రొద్దెక్కింది.

'చలపతి అంతర్ధానమైపోయాట్ట' హరి మాటలకు విస్తుపోయాన్నేను.

ఆ తర్వాత చలపతిని ఐదుసంవత్సరాలు 'డీబార్' చేశారని తెలిసింది.

వేసవి శలవులు అయింతర్వాత కాలేజీలు తెరిచారు. డిగ్రీ క్లాసులో చేరాలని వచ్చిన వాళ్ళలో వెంకుబాబు కూడా కన్పించాడు.

'చలపతి మీ వూళ్ళో వున్నాడా?' అని అడిగేను, వెంకుబాబును.

'మా వూరికి వెళ్లలేదుట వాడు. ఇప్పుడెక్కడున్నాడో కూడా తెలీదు. పాపం వాళ్ల నాయన కలరావచ్చి చనిపోయాడు. మావూరు వచ్చివుంటే వాడికి కలరా వచ్చేది' వెకిలిగా నవ్వేడు వెంకుబాబు.

'చాలా దారుణంగా మాట్లాడేస్తున్నారు మీరు' అన్నాను.

'ఈరోజుల్లో ఉన్న యదార్థాన్ని చెప్తే దారుణమనే వాళ్ళని మిమ్మల్నే చూశాను. నే న లా ఎం దు క న్నా నో మీ కేం తెలుసు? వాడికా బో గ కా లు ఎందుకొచ్చిందనుకున్నారు? వాళ్ళ నాన్నమూలాన్నే. వాళ్ళనాన్నకు రెండుకాళ్లూ బోద. వాళ్ల నాన్న మా వూ ళ్లో వీధులూడ్చేవాడు మేష్టారూ. అప్పుడప్పుడూ ప్రెసిడెంటు గారింటి పాకీదొడ్డి కూడా వూడ్చేవాడు. చలపతికూడా చిన్నతనంలో తండ్రి ఉద్యోగం చేసి వుండడంటారా? అందుకే వాడి కావయసులో బోదకాలు. డామిట్ అది చూస్తేనే నాకసహ్యం. పాపం వాళ్ళనాన్న ఎలాగైనా కొడుకుని పైచదువులు చదివించాలనుకున్నాడు. ఇంటర్ పరీక్షల్లోనే కాపీకొట్టిన వీడు పైచదువులేం చదువుతాడు చెప్పండి?'

నాకప్పుడు అర్థమైంది, చలపతి వెంకుబాబుఅంటే ఎందుకు భయపడేవాడో. తన తండ్రి వృత్తివివరాలూ, తను చిన్నతనంలో తండ్రితోబాటు వీధులూడ్చిన విషయం అప్పటినుంచి తనకావ్యాధి సంక్రమించిన వైనం వెంకుబాబుకు తెలుసు. ఆ విషయాల్ని వెంకుబాబు బయటపెడితే తను



అల్లర్లి పిలవుతానని, తోటి స్నేహితులు తనని చులకనగా చూస్తారని చలపతి భయం. గౌరవ కుటుంబంలో పుట్టిన వెంకుబాబు అలాంటి చలపతిని రూమ్మే టుగా వుంచుకోడానికి ఇష్టపడలేదు. కాని వారిద్దరూ ఒకేరూంలో ఉండడం తప్ప సందున, అందుకు ప్రతీకారంగా వెంకుబాబు చలపతిని అలా వినియోగించుకున్నాడు.

దొంగతనం చేసినవాడు 'దొంగ, దొంగ' అని ముందుగా అరిచినట్లు, చలపతి ధర్మమా అని ఇంటర్మీడియెట్ పాసయి, ఇప్పుడు చలపతే కాపీ చేశాడంటున్న వెంకుబాబుపై నాకు అసహ్యమూ కల్గింది, కోపమూ వచ్చింది. కాని ఏం చేయగల్ను?

*

గతం కథ చలపతిపై ఎలాంటి ముద్ర వేసిందో తెలుసుకోవాలనిపించి చలపతిని అడిగాను మొన్న. 'వెంకుబాబు గుర్తున్నాడా? ఇప్పుడెక్కడ వుంటున్నాడు?'

'వెంకుబాబును మర్చిపోవడమా? బలే వారండీ మీరు. అతను నాకెంతో మేలు చేశాడు. అతన్నెలా మర్చిపోగలను?'

'డీబార్ చేయించడమా మేలు?'

'నిజం. నన్ను డీబార్ చేయకుండా వున్నట్లయితే నేనలాగే చదువుకొనసాగించే వాడ్ని. మహా అయితే గ్రాడ్యుయేట్ నయ్యేవాడ్ని. అదృష్టం కూడా కలిసివస్తే కుటుంబాన్ని పోషించుకునేపాటి ఉద్యోగమూ సంపాదించేవాడ్ని. కాని డీబార్ చేయబడటంవలన నేనేమయ్యానో చూడండి. పై చదువులకుపోయే అవకాశంలేక అమూల్యమైన హోమ్యో శాస్త్రాన్ని స్వయంగా అభ్యసించాను. నేను లాభం పొందటమే కాకుండా దేశంలో కొంతమందికైనా వైద్య వృత్తితో సేవ చేయకలుగుతున్నాను. వెంకుబాబు ఇప్పుడు ఎక్కడుంటేనేం. బ్రతకడమనే ఫైన్ ఆర్ట్సను చిన్నతనంలోనే నేర్చుకున్నాడు. అతనే రంగంలోనైనా నెగ్గుకురాగలడు'

'నిజం చెప్పావ్ చలపతీ! దెబ్బతిన్నవాడెప్పుడూ ఆ దెబ్బ తన మంచికే తగిలిందనుకుంటాడు. సహజమే. అలా అనుకోకపోతే బ్రతకలేడు. కాని దెబ్బ కొట్టినవాడి శక్తినే మెచ్చుకునే నీ క్షమాగుణం నిరుపమానం. గెల్చింది నీవే చలపతీ! హిపిప్.'



everest/117a/ACW tel



భారతదేశములో దగ్గుకు నమ్మకమైన, అధికాధికముగా అమ్ముడవుతున్న ఇంటిమందు